# తెల్లకాకి

**"మా నాన్న** దగ్గర నుంచేనా ఆ ఉత్తరం" భర్తచేతిలో కవరు చూసి అడిగింది అపర్ణ.

"ఔను. సాక్షాత్తూ మీ కన్నతండ్రి దగ్గర్నుంచే. మీ చెల్లెలికి పెళ్ళంట. శుభలేఖ కూడా పంపాడు" అన్నాడు ఆనందరావు. అతడి మాటలలో కించిత్ వెటకారం ధ్వనిస్తోంది.

"ఏమన్నారు?..ఉమకి పెళ్ళా?.. అయితే ఆ సాలూరు సంబంధం ఖాయమయి పోయిందన్న మాట. అబ్బ, ఎంత చల్లని కబురు చెప్పారండి" అంటూ గబగబా వంటింట్లోకి వెళ్ళి గుప్పెడు పంచదార పట్టుకొచ్చి మగడినోట్లో గుమ్మరించింది అపర్ణ.

"చాల్లే సంబడం. చెల్లికి పెళ్ళనగానే ఎక్కడలేని మాటలూ వస్తాయి. అదే నా కివ్వవలసిన స్కూటరుగురించి అడగమంటే మాత్రం నోరు విడదు" నిష్టూరమాడాడు ఆనందరావు.

"మా నాన్న అన్నాడంటే ఎప్పుడో ఒకప్పుడు ఇచ్చి తీరుతాడు. దానికోసం మీరేం కంగారు పడనక్కర్లేదు. మన పెళ్ళికి చేసిన అప్పు ఇంకా తీరలేదంట. కాస్త కాలు చెయ్యి కూడదీసుకోనివ్వండి."

"తండ్రికి తగ్గ కూతురనిపించు కున్నావ్. నువ్వన్నట్టు నిజంగా మీ నాన్నకి డబ్బు ఇబ్బందే ఉంటే ఉమకి పెళ్ళెలా చేస్తున్నాడు" రీజన్ తీసాడు ఆనందరావు.

ఆ మాటకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది అపర్ణకి. అంతే, మరి మాట్లాడలేదు. ఉన్నంతలో ఉమ పెళ్ళి ఆర్భాటంగానే జరిపిస్తున్నాడు జగన్నాథం. అల్లుడు, కూతురూ తప్ప మిగిలిన బంధు జనం అంతా వారంరోజుల ముందుగానే వచ్చి తిష్ట వేసారు. ఎవరికీ ఏ లోటూ రాకుండా జాగ్రత్త పడుతోంది జానకమ్మ.

"స్కూటరు విషయంలో మాట నిలబెట్టుకోనందుకు అల్లుడు అలిగి అటకెక్కాడేమో ననిపిస్తోంది" అన్నాడు జగన్నాథం.

"ఔనండి నాకూ అలాగే అనిపిస్తోంది. చిన్నమ్మాయి పెళ్ళికి పెద్దకూతురు అల్లుడూ రాలేదంటే మనకెంత అవమానం? వెళ్ళి బ్రతిమలాడైనా తీసుకురండి." అన్నది జానకమ్మ.

అలాగే అంటూ చెప్పుల్లో కాళ్ళు దూర్చబోయాడు జగన్నాథం.

మాటల్లో దిగారు ఆనందరావు దంపతులు. జానకమ్మ కళ్ళల్లో వేయి జ్యోతులు వెలిగాయి.

"నీకు నూరేళ్ళయ్యా...ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం" అల్లుణ్ణి ఆప్యాయంగా పలకరించి లోపలికి తీసుకువెళ్ళాడు జగన్నాథం.

రాత్రి పదవుతోంది. ముహూర్తం దగ్గర పడేకొద్దీ మండపంలో జనం పెరుగుతున్నారు. మేళాల మోత, మంత్రాల ఘోష పతాక స్థాయికి చేరుకుంది.

ఉన్నట్లుండి లైట్లు ఆరిపోయాయి. పెళ్ళి పందిట్లో చిమ్మచీకటి అలముకుంది. ఒకరి మొఖాలు ఒకరికి కనబడటం లేదు.

"పెళ్ళే పెళ్ళి ముందు జాగ్రత్తగా గ్యాస్‌లైట్ పెట్టుకోవాలన్న ఇంగిత జ్ఞానం ఉండనక్కర్లా"

సందు దొరికంది కదా అని సన్నిహితులు జగన్నాథాన్ని చివాట్లేస్తున్నారు.

అంతలో " నా నక్లెస్" అంటూ కెవ్వున కేకపెట్టింది అపర్ణ మెడ తడుముకుంటూ.

ఎవరో అగ్గిపుల్ల వెలిగించారు.

భార్య బోసి మెడచూసి షాక్ తిన్నాడు ఆనందరావు.

తలొకరూ తలోరకంగా మాట్లాడసాగారు.

కాస్సేపటికి లైట్లు జిగేలుమన్నాయి. అందరికీ ప్రాణం లేచొచ్చినట్లయింది.

పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా ఆప్తులు, బంధువులు. ఎవర్ని అనుమానించాలో బోధపడటం లేదు జగన్నాథానికి. అడగకుండానే కొందరు తమకేమీ తెలియదన్నట్లు అమాయకంగా తమ హ్యాండ్ బ్యాగులు తెరచి చూపించారు.

పెళ్ళయిపోయింది. తాంబూలాలు తీసుకుని ఆహుతులొక్కొక్కరూ నిష్క్రమిస్తున్నారు. దిగులుగా కూర్చున్న అపర్ణని ఓదార్చుతున్నడు ఆనందరావు.

"పెళ్లికని పుట్టింటికొచ్చిన ఆడపిల్ల కంటతడి పెడుతూ వెళ్తే ఎవరికీ శుభం కాదండి. నా మాట విని వీటి మీద మరికొంత సొమ్మేసి కొత్తనగ పట్టుకురండి" అంటూ చేతులకున్న గాజులు తీసిచ్చింది జానకమ్మ.

ఆఘమేఘాలమీద నగల దుకాణానికెళ్ళి కొత్త నక్లెస్ కొనుక్కొచ్చాడు జగన్నాథం.

పోయిన నగస్థానంలో కొత్త వస్తువు వచ్చి చేరడంతో తృప్తిగా ఊపిరి పీల్చింది అపర్ణ.

మరుచటిరోజే తిరుగు ప్రయాణం అయ్యారు ఆనందరావు దంపతులు.

కాలం కర్పూరంలా కరిగిపోతోంది.

ఉమకు ప్రసవ సమయమని ఇంట్లో ఎవరూ దక్షత లేరంటూ కబురుచేసాడు జగన్నాథం.

తనకు సెలవు దొరక్కపోవడంతో అపర్ణను వెళ్ళిరమ్మన్నాడు ఆనందరావు.

సరేనని ప్రయాణానికి కావలసిన చీరల్ని బీరువాలోంచి తీస్తుండగా నక్లెసు జారి క్రింద పడింది. దానిని చూసి అమితాశ్చర్యపోయింది అపర్ణ. పెళ్ళిలో పోయిన నగ ఇందులో కెలా వచ్చిందా అని ఆలోచిస్తూ ఉండగా, "ఏమిటోయ్ అలా తెల్లబోతున్నావ్? అది నీ నగే" అని అన్నాడు ఆనందరావు దగ్గరకొస్తూ.

"అది...అది" అంటూ ఏదో అనబోతోంది అపర్ణ. అయితే నోట్లోంచి మాట ఊడి బైటపడటం లేదు.

"ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. దాన్ని ఆరోజు నేనే నీ మెడలో నుంచి లాగేసాను" అన్నాడు ఆనందరావు.

"మీ వస్తువుని మీరే దొంగిలించవలసినంత ఖర్మ యేమొచ్చిందండి?" అమాయకంగా అడిగింది అపర్ణ.

"ఇస్తానన్న స్కూటరు ఎంతకీ ఇవ్వక పోవడంతో వళ్ళు మండి అలా చేసాను. నగ పోయిందంటే మీ నాన్న చచ్చినట్లు మరొకటి కొనిస్తాడు" అన్నాడు ఆనందరావు తను చేసిన

నిర్వాకానికి తనే గర్వపడుతూ.

"అదేం పనండి. ఆ రోజు ఆ వస్తువు మీ జేబులోనే ఉందని తెలిస్తే నలుగురిలో మీ పరువువేమయ్యేది?" అంది అపర్ణ భర్త చేసిన పనికి ఛీదరించుకుంటూ.

"దొంగను గుర్తించడానికి అనుమానం వస్తే ఎవరి జేబునైనా చూపించమంటారు తప్ప సొమ్ము పోగొట్టుకున్నవాడి జేబు జోలికి మాత్రం పోరు" అంటూ మానవ మనస్తత్వ శాస్త్రాన్ని విపులీకరించాడు ఆనందరావు.

మరి కిమ్మనలేదు అపర్ణ.

ఆ సాయంత్రమే భార్యను బస్సెక్కించాడు ఆనందరావు. అపర్ణ రాకతో ఆ యింట అందరి మనసులో ఆనందం వెల్లివిరిసింది.

"ఇప్పటికే బాగా ఆలశ్యమైపోయింది. అల్లుడుగారిని ఏమీ అనుకోవద్దని చెప్పు. ఇదిగో స్కూటరు సొమ్ము నిన్ననే నాకు పేఫిక్సేషన్ ఎరియర్సు అందాయి" అంటూ ముప్పైవేలు కూతురి చేతిలో పెట్టబోయాడు జగన్నాథం.

"వద్దు నాన్నా. ఆయన స్కూటరు గురించి మరి డబ్బు అడగొద్దన్నారు" అంది అపర్ణ.

"అదేం అలా" అంటూ నోరు వెళ్ళబెట్టాడు జగన్నాథం.

"నెక్లెస్ పోతే కొత్తది కొనిచ్చావు కదా అందుకని"

"వస్తువు పోతే మరొకటి కొనిచ్చాను. నిజమే. అంత మాత్రాన స్కూటరుకి డబ్బిచ్చినట్లు ఎలా అవుతుంది?" అమాయకంగా అడిగాడు జగన్నాథం.

"మీకెవరికీ తెలీదు కానీ ఆయన మనసు నవనీతం నాన్నా. ఆరోజు కొత్తనగ తెచ్చివ్వడానికి అమ్మ తన గాజులివ్వడం ఆయన కళ్ళారా చూసారు. అందుకే మరి స్కూటరు గురించి వత్తిడి చేయవద్దన్నారు."

"అలాగా, ఏమో అనుకున్నాను. మా అల్లుడు ఎంత మంచివాడు? అనవసరంగా అతన్ని అపార్థం చేసుకున్నాను" నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు జగన్నాథం.

"హుం. తెల్లని కాకులు, అల్లుడి మంచితనం ఇలలో ఎక్కడా ఉండదన్న సామెత ఉండనే ఉంది. నాన్న పిచ్చివాడు. అందుకే నా మాట నమ్మేసాడు. ఇంకా నయం ఆయన ఉండగా డబ్బిచ్చాడు కాదు. తేరగా వచ్చింది కదాని తన్నుకుపోయి ఉండేవాడు" అనుకుంది మనసులో అపర్ణ.

**(అక్టోబరు 1999 ఆంధ్రభూమి మంత్లీ)**